క్లుప్తంగా

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



టెక్కలి: సైకిళ్లు అందజేస్తున్న డీఈవో తిరుమలచైతన్య

టెక్కలి: వసుదైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎటువంటి ఆసరాలేని 40 మంది విద్యార్థులకు శుక్రవారం టెక్కలిలో ఉచితంగా సైకిళ్లు అందజేశారు. టెక్కలి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా విద్యా శాఖాధికారి తిరుమలచైతన్య చేతుల మీదుగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ ఫౌండేషన్ ప్రతినిధులు హరిప్రసన్న, ఈశ్వరరావు మాట్లాడుతూ.. ఆరు నుంచి పదో తరగతి చదువుతూ తల్లి లేదా తండ్రి లేని నిరుపేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీతో పాటు భవిష్యత్‌లో ఉత్తమ విద్యార్థులకు నెలకు వెయ్యి రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు డి.తులసీరెడ్డి, బి.చిన్నారావుతో పాటు ఉపాధ్యాయులు గుణశేఖర్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: వసుదైన కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జై జవాన్.. జై కిసాన్



రైతులు, జవాన్లను సన్మానిస్తున్న సమితి సభ్యులు

సోంపేట: సోంపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం సోంపేట పట్టణానికి చెందిన పలువురు జవాన్లు, రైతులను దుశ్శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. సన్మానం పొందినవారిలో జవాన్లు గుడియా కృష్ణ, ఎం.పోలయ్య, చెలియా పీతంబర్, రైతులు బి.బోగయ్య, శ్యాంసుందర్ ఉన్నారు. దేశానికి రైతులు, జవాన్లు చేస్తున్న సేవలు కొనియాడారు.

పోస్టల్ సేవలకు అంతరాయం!



పోస్టల్ కార్యాలయం వద్ద దర్శనమిచ్చిన నోనెట్ వర్క్ బోర్డు

ఇచ్ఛాపురం: పట్టణంలోని పోస్టల్ శాఖ ప్రధాన కార్యాలయంలో రెండు రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ఖాతాదారులు నానా అవస్థలు పడ్డారు. నెట్ వర్క్ సమస్యతో సేవలకు అంతరాయం కలుగుతుంది. శుక్రవారం ఉదయం వివిధ పనులపై కార్యాలయానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఖాతాదారులకు నోనెట్‌వర్క్ బోర్డు ప్రత్యక్షమైంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పోస్టల్ సిబ్బందిని ప్రశ్నించగా నెట్‌వర్క్ సమస్యవస్తే తాము ఏం చేయగలమని దురుసుగా సమాధానం ఇస్తున్నారని పలువురు వాపోయారు. ఇదే సమస్య గురువారం కూడా తలెత్తిందని.. సిబ్బందికి ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించడంతో సిబ్బంది అంతా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సిబ్బంది తీరుపట్ల ఖాతాదారులంతా అసహనం వ్యక్తం చేసారు. ఇప్పటికైన పోస్టల్ సంబందిత జిల్లా అధికారులు స్పందించి స్థానిక పోస్టాఫీస్‌లో తలెత్తే సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

పారదర్శకంగా ప్రగతి నివేదికలు

కవిటి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతి నివేదికలను పారదర్శకంగా నమోదు చేయాలని ఎంపీడీవో త్రినాథ్ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బందికి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ప్రగతి నివేదికల తయారీపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. విద్యా, మండల పరిషత్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, వైద్య తదితర 29 అనుబంధ శాఖలలో జరిగిన ప్రగతి నివేదిక సూచికలను పారదర్శకంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎంఈవో ధనంజయమజ్జి, వ్యవసాయ శాఖ అధికారిణి పి.శ్రీదేవి, ఏవో శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఖాన్‌అబ్దుల్ పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్ల గోడలను తొలగించిన దృశ్యం

హడావుడిగా తవ్వేశారు..!

- శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పూర్తికాని రోడ్డు విస్తరణ పనులు
- టెక్కలి–చెట్లతాండ్ర రోడ్డులో అసంపూర్తి పనులతో అవస్థలు

టెక్కలి: టెక్కలి పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర మార్గంలో రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా మారాయి. పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో రోడ్డు విస్తరణ చేస్తామంటూ ఏప్రిల్ నెలలో అధికారులు హడావుడి చేసి రాత్రికి రాత్రే ఇళ్లు, దుకాణ సముదాయాలను తొలగించేశారు. ఆ తరువాత రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు పనులకు మంత్రి కె.అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా ఆ తరువాతే విస్తరణ పనుల విషయాన్ని మరిచిపోయారు. శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నప్పటికీ రోడ్డు పనులు పూర్తికాలేదు. అప్పటివరకూ ఉన్న రోడ్డును హడావుడిగా పైపొరను తొలగించేశారు. దీంతో ఒక వైపు ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారితో పాటు నివాసాలు, దుకాణ సముదాయాలు ఉన్న వారంతా ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఇదిలా ఉండగా మొదట విస్తరణ చేస్తామని చెప్పినప్పటికీ రోడ్డు పనుల కోసం కేటాయించిన నిధులు తక్కువగా ఉండడంతో విస్తరణ జరుగుతుందా అనే సందేహం స్థానికంగా వ్యక్తమవుతోంది. కేవలం ఆ ప్రాంతంలో ఉన్న వారిని ఇబ్బందులకు గురి చేయడానికే తప్పా పూర్తిస్థాయిలో రోడ్డు విస్తరణ చేసే పరిస్థితి లేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తి పనులతో అధ్వానంగా ఉన్న రోడ్డు

వర్షాల సమయంలో రోడ్డు పనులు చేపడితే నాణ్యత లోపించి పాడయ్యే అవకాశం ఉందని స్థానికుల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశం



మాట్లాడుతున్న తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను నిలదీస్తూ శనివారం టెక్కలిలో నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. టెక్కలి ఆదిత్య కళ్యాణ మండపంలో ఉదయం పది గంటల నుంచి నిర్వహిస్తున్న సమావేశానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అన్ని అనుబంధ విభాగాల ప్రతినిధులు హాజ రు కావాలని విజ్ఞప్తి చేశారు.

జీజీహెచ్ విద్యార్థినులకు న్యాయం చేయాలి



ఉలాల భారతీదివ్య

ఇచ్ఛాపురం టౌన్: కాకినాడ జీజీహెచ్‌లో లైంగిక వేధింపులకు గురైన విద్యార్థినులకు న్యాయం చేయాలని ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతీదివ్య కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పారామెడికల్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన బయోకెమిస్ట్రీ ల్యాబ్ అటెండింట్ కళ్యాణ్ చక్రవర్తి, మరో ముగ్గురిపై పోలీసు అధికారులు చట్టప్రకారం దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి

సోంపేట, కంచిలి: నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం సోంపేట, కంచిలి పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ.. పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ ఫైళ్లను పరిశీలించి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రోజూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలపై విస్తృత స్థాయి అవగాహన కల్పించాలని అధికారులకు తెలియజేశారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిరోధించేందుకు గ్రామ సందర్శన, దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసు సమన్వయంతో పనిచేయాలన్నారు. సోంపేట సీఐ బి.మంగరాజు, సోంపేట, కంచిలి ఎస్సైలు వి.లోవరాజు, పారినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



సోంపేట స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పాఠశాలల్లో ఇంటరాక్ట్ క్లబ్‌లు ఏర్పాటు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్ట్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షుడు మోహన్ వెంకటేష్ అన్నారు. రోటరీ క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల యజమానులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటరాక్ట్ క్లబ్‌లు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవడంతో సత్సంబంధాలు పెంపొందించబడతాయన్నారు. తద్వార సమాజ సేవలో వారిని భాగస్వామ్యం చేయడం సాధ్యమవుతోందన్నారు. రోటరీక్లబ్ ప్రతినిధులు ^క్కత త్రినాథరెడ్డి, రామకోటి, పాక తులసీదాస్, కృష్ణారావు, జోహార్ ఖాన్, వేదవ్యాస్, ప్రభుత్వోన్నత పాఠశాలలు, కేజీబీవీ, హెబ్రాన్, జ్ఞానభారతి, స్వర్ణభారతి, రవీంద్ర భారతి, శాంతినికేతన్, సత్యసాయి పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

21న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' సమావేశం

ఇచ్ఛాపురం రూరల్: సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం చర్యల్ని ఎండగట్టేందుకు ఈ నెల 21వ తేదీ నుంచి మండలంలో ప్రారంభించనున్న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన మోసాలను ప్రతీ గడపకు తెలియజేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. వైస్ ఎంపీపీ దువ్వ వివేకానందరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీపీ పుష్ప తదితరులు

వరుస క్రమంలో వరి విత్తనాలు నాటుకోవాలి

కంచిలి: వరి దేశీ విత్తనాలను వరుస పద్ధతిలో నాటుకోవడం ద్వారా చక్కని ప్రయోజనాలున్నాయని సేంద్రీయ వ్యవసాయం మండల యాంకర్ టి.శివానందం పేర్కొన్నారు. కొత్తంపురం గ్రామంలోని మద్ది పార్వతికి చెందిన 20 సెంట్ల పొలంలో వరి విత్తనాలను వరుస క్రమంలో నాటే పద్ధతి వలన చేకూరే ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా చేసి శుక్రవారం వివరించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేసి ఘనజీవామృతం వేసి విత్తనాలను నేరుగా వరుసల క్రమంలో నాటడం వలన యాంత్రీకరణ ద్వారా కలుపు తీయడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. కూలీల ఖర్చుకూడా తగ్గుతుందన్నారు. దేశవాళీ విత్తనాలు ఈ ప్రాంత వాతావరణ పరిస్థితిని తట్టుకుంటుందని, దానిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయని రైతులకు వివరించారు. డెమోగా 20 సెంట్లు పొలంలో వరుస క్రమంలో విత్తనాలు వేయించారు. లీడ్ ఫార్మర్స్, రైతులు, ఐసీఆర్‌పీ రేవతి, భవానీ, మీనా, విజయలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.



వరుస క్రమంలో వరి విత్తనాలు వేస్తున్న దృశ్యం

జీవన ప్రమాణాలు మెరుగుపర్చాలి

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళలకు జీవనోపాధిని కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలో మహిళ సమాఖ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకొని ఉత్పత్తులను పెంచి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని చెప్పారు. దీని కోసం వీవోలు గ్రామ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మొరింగా, తేనేటీగల పెంపకం, షెడ్‌నెట్‌లతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ పథకాలపై మరింత అవగాహన కల్పించి అర్హులను గుర్తించాలని అన్నారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షులు కోడ సరస్వతి, కోశాధికారి ఎన్.చంద్రకళ, నిర్మల, సీసీలు హరిప్రియ, నీలవేణి ఉన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు



శిథిలావస్థలో ఉన్న పోస్టుమార్టం భవనం

శిథిల భవనంలో శవాల కోత!

- కూలేందుకు సిద్ధంగా పోస్టుమార్టం భవనం
- పట్టించుకోని అధికారులు

ఇచ్ఛాపురం టౌన్:

ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో ఎవరైన ఆత్మహత్యకు పాల్పడిన, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన, హత్యలకు గురైన వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలిస్తుంటారు. అయితే ఆస్పత్రి ఆవరణలో ఉన్న పోస్టుమార్టం నిర్వహించే భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలు బీటలువారి, శ్లాబు పెచ్చులు రాలుతూ భయగొల్పుతోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలమైనప్పటికీ పట్టించుకునేనాథుడే లేరు. గత్యంతరం లేక ఈ భవనంలోనే మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహిస్తుంటారు. ఒక్కోసారి వైద్యులు అందుబాటులో లేకపోవడం, వివాదాస్పద ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే వారి మృతదేహాలను ఇక్కడ మార్చురీలోనే భద్రపరుస్తుంటారు. అయితే కనీసం ఈ భవనానికి విద్యుత్ సౌకర్యం కూడా లేదు. పోస్టుమార్టం చేసే సమయంలో వైద్యుడుతోపాటు ఉండే సిబ్బంది ఏక్షణంలో శ్లాబ్ పెచ్చులు తమపై పడిపోతాయోననే ఆందోళనలో విధులు నిర్వహిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రి భవవనాలను నిర్మించిన పాలకులు పోస్టుమార్టం కోసం నూతన భవనం నిర్మించాలనే ఆలోచన చేయకపోవడంపై వైద్యులు, సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం భవనం శిథిలమైన విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన లేదంటున్నారు.



పెచ్చులు రాలుతున్న భవనం

భయంతోనే విధులు



పోస్టుమార్టం భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలు బీటలువారి, శ్లాబు పెచ్చులు రాలిపోతున్నాయి. తమపై ఎప్పుడు పడతాయోనని భయపడుతూనే విధులు నిర్వహిస్తున్నాం. నూతన భవనం నిర్మాణానికి రూ. 71 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ ముందుకు రాకలేదు. ఈ విషయాన్ని ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన డయాలిసిస్ సెంటర్ ప్రారంభ సమయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లాం.

–పి.దేవేంద్రరెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

అన్నదాత సుఖీభవకు దరఖాస్తులు

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు పంచాయతీలో 460 మంది రైతులకు 1-బీ అడంగళ్ లేకపోవడంతో అన్నదాత సుఖీభవ పథకానికి నోచుకోలేకపోయారు. దీంతో రైతులు గురువారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌లకు వినత పత్రం అందజేశారు. సంబంధిత అధికారుల ఆదేశాలతో శుక్రవారం 460 మంది రైతులు తమ భూములకు సంబంధించి పాస్ పుస్తకాలు జిరాక్స్ కాపీలు రైతు సేవా కేంద్రానికి అందజేశారు. 1-బీ అడంగళ్ లేకపోయినప్పటికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు.

నియామక పత్రాల అందజేత

కవిటి: రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని కవిటి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ ఎర్ర బాసుదేవ్‌ప్రధాన్ అన్నారు. ఈ మేరకు పీఏసీఎస్ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సభ్యులుగా ఎన్నికైన చైర్మన్ బాసుదేవ్‌ప్రధాన్, సింధుల గున్నయ్య, బొగిడియా భారతిలకు నియామక పత్రాలను అధికారులు శుక్రవారం అందజేశారు. సీఈవో వంజరాన జానకీరామయ్య, సిబ్బంది బెందాళం చిరంజీవి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

నందిగాం: మండలంలోని నౌగాంలో విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన పల్లి ఖగేశ్వరరావు ఆవు శుక్రవారం సాయంత్రం మేతకు వెళ్లి తిరిగి వస్తూ శాలకు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయింది. చనిపోయిన ఆవు సుమారు రూ.70 వేలు ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ దిగువకు ఉందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున దానిని మార్చాలని ఇటీవల గ్రామస్థులు విద్యుత్ శాఖ ఏఈకి ఫిర్యాదు చేయగా.. వారు పరిశీలించి మార్చుతామని చెప్పారు. అయితే పక్కన ఉన్న శాల వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిది కావడంతో స్థానిక తెలుగుదేశం నాయకుల ఒత్తిడి మేరకు ట్రాన్స్‌ఫార్మర్ మార్చకుండా కాలయాపన చేయడంతో ప్రమాదం జరిగిందని, విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆవు మృతి చెందిందని స్థానికులు చెబుతున్నారు. ఇదే మార్గంలో పిల్లలు, వృద్ధులు వెళ్తుంటారని, ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

బహిరంగ పత్రికా ప్రకటన

శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, టెక్కలి గ్రామ పంచాయతీ గ్రామ కాపురస్థులైన ఇంద్ర కుమార్ దేవ్ S/o. మేనకేతన్ దేవ్ అను అతను ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ దాఖలా ఆస్తుల విషయమై వాటా నిమిత్తం O.S.No.07/2025గా మహారాజశ్రీ టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా వేసి ఉన్నారు. అయితే సదరు దావా పెండింగ్‌లో ఉండగా ప్రతివాదులైన దుర్గా శంకర్ ప్రసాద్ దేవ్ S/o. గోవింద్ చంద్ర జగత్ దేవ్ మరియు వగైరాలు దావా ఆస్తి అమ్ముటకు ప్రయత్నం చేయుచున్నట్లుగా నా క్లైంట్‌కు తెలియవచ్చినది. సదరు దావా ఆస్తి పై నా క్లైంట్‌కు వారసత్వ హక్కులు ఉన్నందున ఈ పత్రికా ప్రకటన మూలకముగా జన యావన్మందికి తెలియజేయడమైనది. ఎవరైనా అన్యాక్రాంతముగా సదరు భూములు కొనుగోలు చేసినచో వారిపై సివిల్ మరియు క్రిమినల్ చట్టరీత్యా తగు చర్యలు తీసుకొనబడును అని ఈ బహిరంగ పత్రికాప్రకటన మూలకముగా జన యావన్మందికి తెలియజేయడమైనది. ఈ క్రింది సర్వే నెంబర్‌లో ఆస్తులు గలవు.

షెడ్యూలు దాఖల ఆస్తి వివరములు

సర్వే నెంబర్: 59-2, 59-3, L.P.No.1864, ఖాతా నెంబర్ -892, ఎ.3.39 సెం. సర్వే నెంబర్: 415/1B/B, Assessment No.4410, Dr.No.18-431.

Sd/- PEDADA BABU RAO, B.Com., B.L., Advocate,
Off. & Res: Behind R.D.O.'s Office,
Tekkali -532201, Srikakulam (Dist).
Cell No. 9849388394.

టీచర్‌కు అభినందన



టెక్కలి మండలం గంగాధరపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బి.భవానీని జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్యతో పాటు మండల విద్యాశాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు తదితరులు అభినందించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి గ్రామస్తుల సహకారంతో ఉపాధ్యాయురాలు చేసిన కృషిని శుక్రవారం అభినందించారు. పాఠశాల అభివృద్ధిపై గ్రామస్తులు, ఉపాధ్యాయురాలు చేస్తున్న కృషిపై గత నెల 30వ తేదీన సాక్షిలో 'ఊరి బడికి ఊపిరి'అనే కథనం వెలువడిన సంగతి విదితమే. –టెక్కలి

వ్యవసాయ సిబ్బందికి సన్మానం

సోంపేట డివిజన్ పరిధిలో విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన వ్యవసాయాధికారులను నాలుగు మండలాల వ్యవసాయ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీ శంకరరావు ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయ ప్రయోగశాల ఆవరణలో కార్యక్రమం జరిగింది. సన్మానం పొందిన వారిలో టెక్కలి వ్యవసాయ సంచాలకులుగా బదిలీపై వెళ్లిన కె.జగన్‌మోహనరావు, వ్యవసాయాధికారులుగా బదిలీపై వెళ్లిన బమ్మిడి ధనుంజయ, రాళ్లపేట అప్పారావులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. నాలుగు మండలాల వ్యవసాయాధికారులు బొర్ర నర్సింహామూర్తి, పిరియా శ్రీదేవి, కాంక్యాన సురేస్, పి.వి.వి.అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. –సోంపేట



సిబ్బందికి శిక్షణ



పనిలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పలాస ఎంపీడీవో కె.వసంతకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల పురోగతి సూచిక వెర్షన్ 2.0పై పంచాయతీ అధికారులు, ఏఎస్ఎంలు, డిజిటల్ ఇంజినీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇస్తున్న యాప్‌లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని, నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, రోగాలపై సర్వే చేయాలని చెప్పారు. మాస్టర్ ట్రైనీలు సద్గుణబాబు, వినయ్‌లు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, ఎంఈవో చెరుకు పల్లి సత్యం, రెంటికోట, వెంకటాపురం వైద్యాధికారులు సునీల్‌కుమార్, దేవి పాల్గొన్నారు. –పలాస